# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం । 6 మే 2025 । ■ 12 పేజీలు




4

## అధికారులు ప్రజల్లో నమ్మకం పెంచుకోవాలి

అర్జీదారులు పదేపదే ప్రజావాణికి రాకుండా సమస్యలు పరిష్కరించాలి - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



3

# చీకటి ఉండే చోట వెలుగులు నింపాలి



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. తెలంగాణలో రహదారులు అద్భుతంగా చేసిన ఘనత నరేంద్ర మోదీదే అన్నారు. మరో మూడేళ్లలో రెండు లక్షల కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. రూ.3,900 కోట్ల నిర్మించిన మంచిర్యాల-వాంకిడి ఎన్‌హెచ్ 363 ఫోర్ లేన్ రోడ్, నిర్మల్-ఖానాపూర్ ఎన్‌హెచ్ 61 రెండు లేన్ల రోడ్, నాగ్‌పూర్-హైదరాబాద్ ఎన్‌హెచ్ 44 అండర్‌పాస్, జంక్షన్ లను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. చీకటి ప్రాంతం లో వెలుగులు నింపేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

- తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం ■ రాష్ట్రంలో అద్భుత రహదారుల నిర్మాణం ప్రధాని మోదీ ఘనతే ■ లక్ష కోట్లతో గ్రీన్ హైవే నిర్మాణానికి శ్రీకారం చుట్టాం
- కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ■ ఆదిలాబాద్‌లో రూ.3,900 కోట్ల విలువైన ఎన్‌హెచ్‌లు, జంక్షన్లు జాతికి అంకితం
- నాగ్‌పూర్ టు హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారి నిర్మాణానికి హామీ ■ హాజరైన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్,
- రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు ప్రేంసాగర్ రావు, కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, పాయల్ శంకర్

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- భూ భారతి భూ వివాదాల పరిష్కార వేదిక
- రైతుల సందేహాల నివృత్తికే రెవెన్యూ సదస్సులు..
- భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి
- మీ ఇంట్లో నీటి సమస్య ఉంటే ఇలాగే ప్రవర్తిస్తావా..?
- భీమారం కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

12



భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. భూభారతి అమలుపై పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన భీమారం మండలం ఆరెపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈనెల 20వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూభారతిచట్టంపై అవగాహన కల్పించడంతోపాటు భూసమస్యల పై దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆరెపల్లి గ్రామంలో భగీరథ నీళ్లు రావడం లేదని, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు చెప్పడంతో మీ ఇంట్లో నీటిస మస్య ఉంటే ఇలాగే ప్రవర్తిస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్రీడలతో శారీరక మానసిక దృఢత్వం




వేసవి కాలంలో పిల్లలకు ఆటవిడుపుగా ఉండాలని, చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండడానికి సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.




8

- ఒక్కసారిగా ఉలిక్కి పడ్డ ప్రజలు ■ ఐదు సెండ్ల పాటు కంపించిన భూమి..
- ఖానాపూర్‌లో భయంతో పరుగులు తీసిన జనం
- మంచిర్యాల జిల్లా జన్నారం, నిర్మల్ జిల్లా మామడలో కిందపడ్డ వస్తువులు
- నిర్మల్‌లోనూ భూప్రకంపనలు ■ భయాందోళనకు గురైన ప్రజలు
- రిక్టర్ స్కేల్‌పై 3.9శాతంగా నమోదు ■ సింగరేణిని వణికిస్తున్న భూకంపాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో భూమి ఒక్కసారిగా కంపించడంతో జనం ఇండ్ల నుంచి పరుగులు తీశారు. సోమవారం సాయంత్రం 6:52 నిమిషాలకు ఐదు సెకండ్ల పాటు భూమి కంపించింది.. ఇండ్లలో ఉన్న వస్తువులు కదులుతుండడంతో జనం ఇక్కసారిగా ఉల్కిపడ్డారు. ఆతరువాత పరిస్థితి సద్దుమణగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## గాలివాన బీభత్సం

### పంటలు వర్షార్పణం

- అకాలవాన అన్నదాతను ఏడిపిస్తోంది ■ నిండు వేసవిలో వరుణ దాడి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సం ■ కల్లాల్లో తడిసిన ధాన్యం..
- నిర్మల్‌లో కొట్టుకుపోయిన టార్పాలిన్లు ■ ఆందోళనలో అన్నదాతలు

FARMERS LOSS DUE TO HEAVY RAIN

అకాలవాన అన్నదాతను ఏడిపిస్తోంది.. నిండు వేసవిలో వరుణ దాడి తెలియక రైతాంగం లబోదిబోమంటున్నారు. వాతావరణ మార్పులతో ఉరుకులు..పరుగులు పెడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ వర్షం కురిసింది. నిర్మల్ జిల్లాలో గోదావరి పరివాహక మండలాల్లో సుమారు గంటకుపైగా కురిసిన భారీ వర్షం రైతాంగాన్ని తీవ్రంగా నష్టానికి గురిచేసింది. రైతులు తాము ఆరుగాలం పండించిన పంటను జాతీయ రహదారులకు ఇరువైపులా ఆరబెట్టారు. ఉదయం నుంచి భానుడు మండిపడ్డాడు.. వాతావరణం బాగానే ఉందని ఎక్కడ వారు అక్కడ సర్దుకున్నారు. సాయంత్రం అకాల వర్షం రావడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పరుగులు తీశారు.



11



## భూభారతి రెవెన్యూ సదస్సులను
# సద్వినియోగం చేసుకోవాలి

■ పెండింగ్‌లో ఉన్న సాదా బైనమాల క్రమబద్ధీకరణ ■ నూతన చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది
■ కుంటాల మండలం ఓల గ్రామంలో రెవెన్యూ సదస్సులో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేస్తూ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కుంటాల మండలంలోని ఓల గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడం, వారి సందేహాల నివృత్తి చేయడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూమిపై పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు, విస్తీర్ణం లోపాలు, వారసత్వ భూములు, భూ స్వభావం, నిషేధిత జాబితాలోని భూములు, సర్వే నంబర్ల లోపాలు, పట్టా పాస్ బుక్కుల లేని భూములు, సాదాబైనామాలు, హద్దుల సమస్యలు, పార్ట్-బి భూములు, భూసేకరణ కేసులపై దరఖాస్తులు స్వీకరించి, భూభారతి నూతనఆర్.ఓ.ఆర్ ప్రకారం విచారణ జరిపి పరిష్కరిస్తామని వివరించారు. వివిధ కారణాల వలన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు సమర్పించలేని వారు తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో అప్లై చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రింట్ చేసిన ప్రొఫార్మాల ఆధారంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, క్షేత్రస్థాయి విచారణకు వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌ల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసీల్దార్ కమల్ సింగ్, తహసీల్దార్ ప్రత్యేక అధికారులు ఏజాజ్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





## రాజీయే.. రాజమార్గం

■ జాతీయ లోక్ అదాలత్ అద్భుతమైన అవకాశం
■ నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**

జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సూచించారు. సోమవారం పోలీస్ అధికారులు, కోర్టు పోలీస్ అధికారులతో ఆన్లైన్‌లో దిశా నిర్దేశం చేశారు. వివాదాలు, రాజీపడే క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న టూ వీలర్ ఫోర్ వీలర్ చలాన్ కేసులు, పెట్టీ కేసులు మొదలైన వాటికి సంభందించిన కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కక్షిదారులందరికి సమాచారం అందించి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం ద్వారా వారి యొక్క సమయం, డబ్బును ఆదా చేసుకోవచ్చున్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవకాశం ఉన్న కేసుల వివరాల జాబితాను తయారు చేసుకుని సంబంధిత పోలీసు అధికారులు వారందరికీ సమాచారం అందించాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కునేలా వారికి కేసుల గురించి వివరించాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

■ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా

**ఉట్నూర్, మే 5 (ప్రభాత సమాచారం)**



గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం కమైపేట్ గ్రామానికి చెందిన భీంరావ్ తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కలిపించామని,బోథ్ మండలం సంఘ్వి గ్రామానికి చెందిన రాజేశ్వరి తనకు పట్టా మంజూరు కల్పించమని. జైనూర్ మండలం పానపటర్ గ్రామానికి చెందిన ఆత్రం లత తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని కోరారు. పింఛన్,ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పివో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో ఎపిఓ మెస్రం మనోహర్, ఏఓ దామోదర స్వామి మనోహర్, ఈ ఈ తనజీ, పిహెచ్ఓ సందీప్ కుమార్, మేనేజర్ శ్యామల డిపిఓ ప్రవీణ్ జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## న్యాయవాది మృతికి బార్
# అసోసియేషన్ సంతాపం

**ఉట్నూర్, మే 5 (ప్రభాత సమాచారం)**

అనారోగ్యంతో మృతి చెందిన హై కోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని గుండె పోటుతో మృతి చెందిన సీనియర్ న్యాయవాది పి. నారాయణల మృతిపట్ల ఉట్నూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ హాలులో సోమవారం న్యాయవాదులు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు బాపు రెడ్డి సీనియర్ న్యాయవాది జమీర్ ఖాన్ మాట్లాడుతూ నారాయణ ఉట్నూర్ కోర్టులో చేసిన న్యాయ సేవలను కొనియాడారు. మంచిర్యాలలో కోర్టు ఏర్పాటుకు అయన కృషి చేసారని గుర్తు చేసారు. అనంతరం రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి. జైవంత్ రావు న్యాయవాదులు ధీరజ్ గుప్తా పెందూర్ ప్రభాకర్ సి. హెచ్. శ్రీనివాస్, వసంత్ రావు, అశోక్ నాతరి రాజు వినోద్ లక్ష్మీనారాయణ అజహార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు చెట్లు విరిగి ఇల్లు ధ్వంసం

**మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)**



పట్టణంలో రాత్రి వీచిన భారీ ఈదురు గాలులు, వర్షాలకు కేకే-5 ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో నివాసముండే బానోత్ కుమార్-కమల దంపతుల ఇంటిపై భారీ వృక్షం విరిగి పడటంతో ఇల్లు, రేకులు, గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకుడు కిరణ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబం ఇబ్బందులను మండల తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్ళగా స్పందించిన అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు కిరణ్, పెద్దిరాజు, సురేందర్, సుజిత్, రవికిరణ్ పాల్గొన్నారు.

## కోర్టు భవనాలకు
# స్థలం కేటాయించండి

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించబడుతున్న కోర్టులకు సొంత స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్కు వినతి పత్రాన్ని అందించారు. సభ్యులు మల్లారెడ్డి వెంకటరమణ ఎంసీ లింగన్న తదితరులు సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి న్యాయం జరిగేటట్లు చూడాలని కోరారు.



## విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది

■ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**



రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఇటీవల విడుదలైన ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్ ఫలితాలలో మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ అన్ని రకాలుగా కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల బాలికల జూనియర్ కళాశాల నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎ.లిఖిత, షేక్ సీద్రాకొహిన్, ద్వితీయ సంవత్సరంలో బి.సాత్విక, ఎండి. అజాబీ, బెల్లంపల్లి బాలికల జూనియర్ కళాశాల నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మహెక్ నజ్నీన్, ద్వితీయ సంవత్సరంలో జునైన సాబా, నిదాఫిర్గోస్, చెన్నూర్ బాలుర జూనియర్ కళాశాల నుండి ప్రథమ సంవత్సరంలో ఎన్.అభిరామ్, ఓ. సిద్దు, ద్వితీయ సంవత్సరంలో బి. వరుణ్ తేజ, ఎండి. అమన్ లు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఎస్.ఎస్.సి.లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని బెల్లంపల్లి బాలికల పాఠశాల నుండి డి. అక్షయ, సుహైర్య, మంచిర్యాల బాలికల పాఠశాల నుండి వైష్ణవి, డి. రిషిత, ఎస్.వైశాలి, చెన్నూర్ బాలుర పాఠశాల నుండి ఎండి. సమీర్, ఎండి. ఫిరోజ్, ఎస్.రాంసూరిలు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. విద్యా రంగంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# చీకటి ఉండే చోట వెలుగులు నింపాలి

- తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం ■ రాష్ట్రంలో అద్భుత రహదారుల నిర్మాణం ప్రధాని మోదీ ఘనతే
- లక్ష కోట్లతో గ్రీన్ హైవే నిర్మాణానికి శ్రీకారం చుట్టాం
- కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ
- ఆదిలాబాద్‌లో రూ.3,900 కోట్ల విలువైన ఎన్‌హెచ్‌లు, జంక్షన్లు జాతికి అంకితం
- నాగ్‌పూర్ టు హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారి నిర్మాణానికి హామీ
- హాజరైన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ■ రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు ప్రేంసాగర్ రావు, కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, పాయల్ శంకర్..










(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

తెలం గాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. తెలంగాణలో రహదారులు అద్భుతంగా చేసిన ఘనత నరేంద్ర మోదీదే అని తెలిపారు. మరో మూడేళ్లలో రెండు లక్షల కోట్లతో అభివృద్ధి చేస్తా మని హామీ ఇచ్చారు. రూ.3,900 కోట్ల వ్యయంతో నిర్మిం చిన మంచిర్యాల-వాంకిడి (మహారాష్ట్ర సరిహద్దు), ఎన్ హెచ్ 363 ఫోర్ లేన్ రోడ్, నిర్మల్-ఖానాపూర్ ఎన్‌హెచ్ 61 రెండు లేన్ల రోడ్, నాగ్‌పూర్- హైదరాబాద్ ఎన్‌హెచ్ 44 రహదారిలో అండర్‌పాస్, జంక్షన్‌లను కేంద్ర మంత్రు లు జీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి సీతక్కతో కలిసి ప్రారంభించారు. అనంతరం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్ సమీపంలో స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గడ్కరీ మాట్లాడారు.. జల సంరక్షణతోనే అభివృద్ధి సాధ్యమ వుతుందన్నారు. దీన్‌దయాళ్ స్ఫూర్తితో కేంద్రప్ర భుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్టు వివరించారు. గూ డు, తిండి, గుడ్డ లేని పేదవారికి సేవలందించడమే రాజనీతి అని తెలిపారు. చీకటి ప్రాంతంలో వెలుగులు నింపేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రైతులు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా దేశంలోని రహదారుల అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు.

**రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం..**

తెలంగాణ రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటివరకు 5 వేల కిలోమీటర్లకుపైగా జాతీయ రహదారుల వేశామని కేంద్ర మంత్రి గడ్కరీ తెలిపారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. గడ్చిరోలి జిల్లాకు అనేకసార్లు వెళ్లానని, ఆ జిల్లాకు ఆనుకొని ఉన్న ఈ ప్రాంతం గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. 'మన రైతు కేవలం అన్నదాతగా కాకుండా సాంకేతికతను అందిపుచ్చుకొని అన్ని రకాలుగా ఎదగాలి.

**నీళ్లను నిల్వ చేయండి..**

ఇంటి నీళ్లు ఇంటి వద్ద.. పొలం నీళ్లు పొలంలోనే.. గ్రామం లోని నీళ్లు గ్రామంలోనే స్టోరేజ్ చేసుకోవాలి' అని సూచిం చారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులలో నీటిని స్టోరేజ్ చేసుకునేలా ప్రణాళిక చేసుకోవాలని తెలంగాణ సీఎంకు సూచిస్తున్నట్టు చెప్పారు. ఇప్పుడు జరిగిన అభివృద్ధి న్యూస్ రీల్ మాత్రమే, ఇంకా అసలు సినిమా ముందుందన్నారు. తెలంగాణలో లక్ష కోట్లతో గ్రీన్ హైవే నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నా రు. శ్రీనగర్ జమ్మూ మధ్యలో 36 టన్నెల్‌లు నిర్మిస్తున్నా మని, కశ్మీర్ నుండి కన్యాకుమారి రహదారి కల నెరవేరు తుందని, తెలంగాణలో ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాల పల్లి, విజయవాడ మీదుగా రహదారి వస్తుందన్నారు. మేడా రం రహదారి విస్తరణకు పనులు చేస్తామని, నాగపూర్ నుం చి హైదరాబాద్‌కు ఆరు వరసల జాతీయ రహదారి మంజూ రు చేస్తామని తెలిపారు.

**అంకితభావంతో పనిచేస్తున్నాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నా మని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలు ఉంటే 32 జిల్లాలు జాతీ య రహదారులతో అనుసంధానం చేయడం జరిగింద న్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపడుతున్నామన్నారు. రోడ్డు రవాణా వ్యవస్థను సరళీకృతం చేసిన ఘనత ప్రధానమంత్రి మోదీ, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి దక్కుతుందన్నారు. రోడ్డు, రైల్ కనెక్టివిటీ కోసం కేంద్రం కృషి చేస్తోందని తెలి పారు. ఇండస్ట్రియల్ పరంగా వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, 7 మ్యానుఫ్యాక్చరింగ్ యూ నిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రామగుండంలో 8 వందల మెగావాట్ల పవర్ ప్లాంట్, 100 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు యూరియా పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**వెనుకబాటుకు గత ప్రభుత్వాలే కారణం**
**కేంద్రమంత్రి బండి సంజయ్..**

గత ప్రభుత్వాలు, పాలకుల కారణంగానే ఈ ప్రాంతం వెను కబాటు జరిగిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బం డి సంజయ్ ఆరోపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్రం కట్టుబడి ఉంద న్నారు. రహదారుల నిర్మాణానికి రూ.1,25,000 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో ఉన్న ప్రభుత్వం నరేంద్ర మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకుందని పరోక్షంగా బీఆర్ఎస్‌ను విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపా లు చేయడం వల్ల ఏవిధంగా ప్రాంతం వెనుకబడ్డదో ప్రజలు గమనించారన్నారు. ఎన్నికల ముందే రాజకీయాలు తర్వాత కలసి పనిచేస్తేనే అభివృద్ధి చెందుతుందన్నారు.

**అభివృద్ధికి సహకరిస్తాం**
**రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పా రు. మారుమూల జిల్లాలకు సైతం జాతీయ రహదారుల ని ర్మాణం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల రహ దారుల నిర్మాణం చేయడంతో పాటు హైదరాబాద్‌లో నూ ఫ్లై ఓవర్స్ వేయవలసి ఉందన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు.

**జోడేద్దుల్లా అభివృద్ధికి పాటుపడదాం**
**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధికి జోడెద్దుల కలసి పని చేద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చాలా వెనుకబడిన ప్రాంతం ఇక్కడ పేదరికంతో పాటు అభివృద్ధిలోనూ వెనుకబడి ఉందన్నారు. రోడ్ల అనుసంధానంతో అభివృద్ధి సాధ్యమవుతుందని దానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రహదారులను మంజూరు చేయాలని కోరారు.

**మరిన్ని రహదారులు నిర్మించాలి**
**ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్**

తెలంగాణ రాష్ట్రానికి పక్కన ఉన్న మహారాష్ట్రతో అనుసంధా నిస్తూ మరిన్ని జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. జిల్లాలో 300 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం చేపట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుంది. అదే తరహాలో ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్, ఆసిఫాబాద్ మీదు గా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అల్లాపల్లి వరకు జాతీయ రహదారి నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. తద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. పెండింగ్ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

**పెండింగ్ పనులు పూర్తిచేయాలి : ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

మంచిర్యాల నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన జాతీయ రహదారి పనుల్లో అక్కడక్కడ చిన్నచిన్న పనులు పెండింగ్ ఉన్నాయి. హైవే పక్కన ఉన్న సర్వీసు రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం, లైనింగ్ వంటి పనులు పూర్తికాలేదు. వాటిని వెంటనే పూర్తిచేయాలి. రెబ్బెన మండలంలో అత్యం త ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో అడ్డంగా ఉన్న రైల్వేగేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి. అటవీశాఖ అనుమతులు లేని కారణంగా జిల్లాలో మంజూరైన అనేక రోడ్లు ప్రారంభం కావడం లేదు. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల్లో రోడ్ల పనులు చేపట్టేందుకు అటవీశాఖ అనుమతులు త్వరగా వచ్చేలా కృషి చేయాలి.

**ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు**

ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం కాగజ్‌నగర్ క్రాస్ రోడ్ వద్ద నేషనల్ హైవే 363 మంచిర్యాల- నుంచి మహా రాష్ట్ర సరిహద్దు వరకు రూ.3,526 కోట్ల వ్యయంతో 94.6 కిలోమీటర్ల మేర నిర్మించిన నాలుగు వరుసల రహదారి, నిర్మల్‌ఖానాపూర్ మధ్య రూ.127 కోట్లతో 17.79 కిలో మీటర్ల రెండు వరుసల నేషనల్ హైవే 61కు, నేషనల్ హైవే 44 నాగపూర్‌హైదరాబాద్ మధ్యలో రూ.29 కోట్లతో నిర్మించిన అండర్‌పాస్ నిర్మాణం, నాగ్‌పూర్-హైదరాబాద్ మధ్యలో రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించిన సర్వీస్ రోడ్లు, జంక్షన్లను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ జాతికి అంకితం చేశారు. ఎన్‌హెచ్ 44 నాగ్‌పూర్‌హైదరాబాద్ మధ్యలో రూ.173 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు, ఆర్మూర్‌జగిత్యాలుమంచిర్యాల ఎన్‌హెచ్-63పై రూ.29 కోట్ల వ్యయంతో మూడు కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఫోర్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

**కేంద్రమంత్రికి బెల్లంపల్లి రవాణా సమస్యలు..**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ మర్యాదపూర్వకంగా కలిసి బెల్లంపల్లి, తాండూరు మధ్య జాతీయ రహదారి రవాణా సమస్యలను విన్నవించారు. వాం కిడి నుండి మంచిర్యాల మధ్య నిర్మించిన జాతీయ రహ దారి 363 ప్రారంభోత్సవానికి కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయ నకు వినోద్ స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి తాండూర్ నుండి గడిచిరోలి వయా భీమిని గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభం, తాండూర్-బోయపల్లి నుండి కల్వర్ చర్చి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం మం త్రికి విన్నవించారు. బెల్లంపల్లి పట్టణంలో వైజంక్షన్ దగ్గర రీలింగ్ ఏర్పాటు, తాండూర్ పెట్రోల్ బంకు దగ్గర హై లెవెల్ అండర్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు.











# ప్రజావాణి ఆర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**అర్జీదారులు మళ్లీమళ్లీ రాకుండా అధికారులు సమస్యలు పరిష్కరించాలి - మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. భీమారం మండల కేంద్రానికి సందనవేని అజయ్ మండలంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తుందని, ఈ విషయమై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన కునరపు చంద్రమొగిలి తనకు గ్రామ శివారులో ఉన్న భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించారని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్‌లోని షట్టర్ల లబ్దిదారులు తాము వ్యాపారం చేసుకునే స్థలాన్ని అప్పగించినప్పుడు తమకు షట్టర్లు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు వ్యాపారము చేసుకునే వరుసలో రూములు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన ఎగ్గె ప్రవీణ్ గ్రామ శివారులో తమకు చెందిన భూమిని బంధువులు తమకు తెలియకుండా విక్రయించారని, ఈ లావాదేవీని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన చిందం లలిత తాను మీ సేవ ఏర్పాటుకు అర్హత కలిగి ఉన్నానని, అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సి.పి.ఐ.(ఎం) న్యూడెమొక్రసీ ప్రతినిధులు తమ దరఖాస్తులో లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల చెరువుకు సంబంధించి ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్లను నిర్ణయించి చెరువు కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన రామగిరి అరుణ తాను గత సంవత్సరాలుగా కిరాయి ఇంట్లో నివసిస్తున్నానని, తన భర్త మరణించారని, నిరుపేద అయిన తనకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.






## తూకం వేసిన ధాన్యాన్ని గోదాంలకు తరలించాలి

**జన్నారం, మే 5 (ప్రభాత సమాచారం)**

మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకెపి పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించాలని, మండల సామాజిక ఉద్యమకారుడు శ్రీరాముల, భూమా చారి అన్నారు. సోమవారం ప్రధాన రహదారి మండల తాసిల్ చౌరస్తా నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం 5 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అయినా సరే ఆ నష్టాన్ని రైతులు ఓర్చుకున్నప్పటికీ, తూకంలో జాప్యం చేస్తూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీల ద్వారా గోదాములకు తరలిస్తే, అకాల వర్షాలకు రైతులు, ధాన్యం తడవకుండా రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. ఆలస్యం చేయడం వల్ల అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే తూకం వేస్తూ వెంటవెంటనే తూకం వేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించి రైతులను ఆదుకోవాలన్నారు.

# పాకిస్థానీయులపై చర్యలు తీసుకోవాలి

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**

దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంతో పాటు బైంసా, నిర్మల్, ముధోల్, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో పార్టీ ఆదేశాల మేరకు అక్రమంగా ఉంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీలు నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్ కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. దేశంలో ఉగ్రవాదాన్ని మోదీ ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి సర్కార్ దాన్ని అమలు చేయకుండా రాష్ట్రంలో వలస వచ్చిన వారిని గుర్తించడంలో విఫలమవుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టిపిఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో విన్నర్స్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. సైకాలజిస్ట్ లు పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా టీపీఏ జిల్లా అధ్యక్షులు, సైకాలజిస్ట్ వేణుకుమార్ మాట్లాడుతూ... తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ 2017లో డాక్టర్ రామచందర్‌చే స్థాపించబడి తెలంగాణ వ్యాప్తంగా ఎనిమిది సంవత్సరాలుగా మానసిక రుగ్మతలను నిర్మూలించేందుకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అదే విధంగా నేటి సమాజంలోని పరిస్థితుల వలన చాలామంది వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధించబడుతున్నారని, వారందరినీ మానసికంగా దృఢపరిచే విధంగా పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల మానసిక ఎదుగుదలను పెంపొందించే విధంగా పాఠ్యాంశాలను చేర్చి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో సైకాలజిస్టులను నియమించాలని కోరారు. దీని ద్వారానే సమాజంలో ఒక నైతికతను పెంపొందించడంతో పాటు, విద్యార్థులు, యువత మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకొని మంచి పౌరులుగా నిర్మితమవుతారన్నారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల జిల్లా గౌరవ సలహాదారులు కేటిఎస్ స్కూల్ చైర్మన్ పద్మచరణ్, గుండేటి యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుమన చైతన్య, వైస్ ప్రెసిడెంట్స్ మొగిలి, రజిత, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు తాళ్లపల్లి కవిత, విన్నర్స్ అకాడమీ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.



## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల విజ్ఞప్తులు ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల అంశాలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని, శాఖలవారీగా పెండింగ్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా సిద్ధం చేయాలని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో అవసరమైన మరమ్మత్తులు చేపట్టి సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులంతా సమయపాలన పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణిలో 91005 77132 నంబరుకు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలు తెలియజేయాలని, వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అధికారులు ప్రజల్లో నమ్మకం పెంచుకోవాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా ప్రజలు అందించే దరఖాస్తులను సత్వరమే పరి ష్కరించి అధికారులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామ లాదేవి తో కలసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వారు సమర్పించిన అర్జీలను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారులు తమ సమస్యలను దరఖాస్తు రూపం లో జిల్లా ఏకు సమర్పించగా వాటిని ఆయన ఆయా శాఖల సంబంధిత అధికారులకు అందజే శారు. అనంతరం అధికారులకు తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. ఇందులో వివిధ సమస్యలపై ప్రజావాణి లో ప్రజలు 148 దరఖాస్తులు సమర్పించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, పంచాయతీ, విద్య, రెవెన్యు, తదితరశాఖల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.



అప్పుడే అధికారులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుం దని తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్టుపై
# బీజేపీ, కాంగ్రెస్‌ది దుష్ప్రచారమే

### రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జీ రాజా రమేష్

**మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అతిపెద్ద ప్రాజెక్టైనా కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలిపేందుకు మాజీమంత్రి, ధర్మపురి మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్టమధుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్ సమావేశంలో సమావేశానికి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసత్య ప్రచారాలు చేస్తూ, ప్రజల్లో కేసీఆర్ నాయకత్వాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయాని విమర్శించారు. కేసీఆర్‌కు తెలంగాణ మీద అవగాహన ఉండి, ప్రజలకు ఏం కావాలో తెలిసిన వ్యక్తిగా, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించిన జననేత, మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ దెబ్బ తీయాలని ఆలోచిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కనీస అవగాహన లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై అక్కసుతో 93 వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని అనడం నిజంగా తెలివికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, సిడబ్ల్యూసి, ఎన్డిఎస్ఏలు ప్రాజెక్టు కట్టినప్పటి నుండి ఇప్పటివరకు నిద్రపోతున్నాయా అని ప్రశ్నించారు. నేడు కాంగ్రెస్, బిజెపి నాయకుల కుట్రల వల్ల రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు మళ్లీ ప్రారంభం కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు ఉద్యోగుల వినతి

**బెల్లంపల్లి, మే 5 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ జాయింట్ ఆక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉద్యోగులు ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలను వివరించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి ఉద్యోగుల సమస్యల పరిషాకారానికి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉద్యోగుల కుంటుంబలకు చేయుతను అందించాలని విజ్ఞప్తి 57 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వినోద్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి, రాష్ట సెక్రెటరీ మల్లయ్య, డిప్యూటి సెక్రెటరీ జనరల్ భూముల రామ్ మోహన్, కో-చైర్మన్ శ్రిపతి బాపూరావు చక్రపాణి, రవి, చెన్న కేశవులు, రసుధాకర్ గోపాల్ ఉన్నారు.

## డీ-1 పట్టాలు రద్దుచేయాలి



**సోన్, మే 5 (ప్రభాత సమాచారం)**

సోన్ మండలంలోని సిద్దిలకుంటలో అక్రమ డీ-1 పట్టాలు రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. శ్రీరాంసాగర్ జలాశయం ముంపునకు గురైన గ్రామంలో భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వం 23 ఎకరాల మిగులు భూమిని కేటాయించగా కొందరు అక్రమంగా పట్టాలు సృష్టించి కబ్జా చేస్తు న్నారన్నారు. 2022లో డీ-1 పట్టాను అప్పటి కలెక్టర్ రద్దు చేసినప్పటికీ మళ్లీ సాగు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్పం దించిన కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడి పట్టాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.

## జర్నలిస్టు క్రాంతి కుమార్‌కు జాతీయ పురస్కారం



**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**

అంతర్జాతీయ సేవా సంస్థ తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, మాచవరం సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో నిర్వహించిన రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలువీక్షకులను అలరించాయి. ఈ వేడుకల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన జర్నలిస్ట్ జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ ఆఫ్ వార్త) దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆధ్యాత్మిక గురువు దైవాజ్ఞ శర్మ, నవల రచయిత సురపల్లి విజయ, న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపికృష్ణ, విప్రో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాస్, అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర, పాండిచ్చేరి తదితర రాష్ట్రాలకు చెందిన వారిని వివిధ పురస్కారాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ వేడుకల్లో ఉత్తమ జర్నలిస్టుల విభాగంలో జిల్లాలోని మందమర్రి పట్టణానికి చెందిన జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ అఫ్ వార్త)కు జాతీయ అవార్డు-2025ను అందజేశారు. క్రాంతికుమార్ జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా పలువురు జర్నలిస్టులు, స్నేహితులు, స్థానిక ప్రజలు ఆయనను అభినందించారు.



## రికార్డుల నిర్వహణను
# సక్రమంగా చేపట్టాలి

### బోథ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**బోథ్, మే 5 (ప్రభాత సమాచారం)**

కేసులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బోథ్ పోలీస్‌స్టేషన్‌ను సోమ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. అదేవిధంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ వాహనాల, సిబ్బంది పని తీరుపై అరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ ఆరికట్టాలన్నారు. రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మమే కమై సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ, ఎలాంటి రిమార్కులు లేకుండా, ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొం దించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. బోథ్ సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ కాలేజ్‌లో
# దోస్త్ హెల్ప్ లైన్ ఏర్పాటు

**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని విద్యార్థుల సౌకర్యార్థం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ లో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె సంగీత సోమవారం తెలిపారు. మే 3వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంని అన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఏమైనా సమస్యలు వస్తే.. దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ను సంప్రదించాలని సూచించారు. మూడు దశల ఆన్లైన్ దరఖాస్తుల కోసం హెల్ప్ లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు దోస్తు కోఆర్డినేటర్ రవి కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఇమ్రాన్ అలీ, దుర్గా శేఖర్ లను 7702157284, 9703533626 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# భూభారతి చట్టంతో భూసమస్యలకు పరిష్కారం

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన భూభారతి చట్టం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందని, ఈ చట్టం అమలుతో ధరణి చట్టానికి ముందున్న సాధాబైనమా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రానుందని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండానే తహసిల్దార్ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. నూతన చట్టం ప్రకారం భూ సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేస్తే, సంబంధిత అధికారులు నిర్ణిత గడువులోగా విచారించి, పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు. నేటి నుండి కుంటాల మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, ప్రజల నుంచి భూసంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రజలు, రైతుల సమస్యలను కలెక్టర్ స్వయంగా విని, పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సందీప్ కుమార్, తహసిల్దార్ రాజు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ మేల్కొలుపు రథయాత్ర ప్రారంభం

**ఆసిఫాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**
బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'మేమెంతో మా కంత' నినాదంతో సోమవారం మండల కేంద్రం నుంచి బీసీ మేల్కొలుపు రథ యాత్ర ప్రారంభించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్లో ప్రజా సంఘాలు, వివిధ కుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కాని సంజయ్కుమార్ మాట్లాడుతూ బీసీ లు అన్నిరంగాల్లో వెనుకడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు జనాభా ప్రతిపాదికన బీసీలకు విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సామాజిక ఉద్యమ పితామహుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్పూర్తితో ఆయన స్వగ్రామం వాంకిడి నుంచి బీసీ మేల్కొలుపు రథయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. సుదీర్ఘంగా కొనసాగనున్న ఈ రథయాత్ర అలంపూర్లో ముగుస్తుందన్నారు.

## ఆర్టీసీ సమ్మె విజయవంతం చేయాలి



**ఆసిఫాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**
జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ఆర్టీసీ సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులతో కలిసి జేఏసీ కన్వీనర్ దివాకర్ అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, కొత్త అలవెన్స్ అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులో జరిగే తప్పిదాలకు సిబ్బంది ని శిక్షించొద్దని, కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని, ప్రస్తుతం కన్సాలిటేడెడ్ పే కింద పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై న మోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు. సంస్థలోని మహిళా కండక్టర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం సమ్మెకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిడుగు శంకర్, డిపో అధ్యక్షుడు అశోక్, నాయకులు ఆత్మకూరి చిరంజీవి, మోహన్బాబు, రఘులయ్య, శ్రీనివాస్, ప్రేం సింగ్, హరికృష్ణ, శోభన్బాబు, తిరుపతి పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై యువకుడి బలవన్మరణం

**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్రీరల్ మండలం అంకోలికి చెందిన యువకుడు భవన్(25)మద్యానికిబానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం పట్ట ణంలో పురుగుల మందు తాగి పడిపోగా, స్థానికులు గమనించి రిమ్స్కు తరలించారు. రాత్రి చికిత్స పొం దుతూ మృతి చెందాడు. తండ్రి హన్మాండ్లు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

## టాస్క్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ

### పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన టాస్క్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మాట్లాడుతూ 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ మొదటి విడతలో ఎంపికైన 40 మంది నిరుద్యోగ యువతకు శిక్షణలో భాగంగా సి, సిం, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఇంటర్వ్యూ నైపుణ్యాలలో శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థుల వయస్సు 18-30 సంవత్సరాల మధ్య ఉండాలని, డిగ్రీ, డిప్లొమా, బి.టెక్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ ప్రతినిధి సాయికృష్ణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సామాన్యులకు అండగా పోలీసులు



### నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**
సామాన్యులకు అండగా పోలీసులు ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

**ఆసిఫాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి టాలెంట్ టెస్టు ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ పీపుల్స్ ప్రొగ్రెసివ్ ట్రస్ట్ ద్వారా టాలెంట్ టెస్టు నిర్వహించామని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు హాస్టల్ వసతితో కూడిన ఉచిత విద్యనందిస్తారని తెలిపారు. 87 మంది విద్యార్థులకు 81 మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కమలాకర్ రెడ్డి, నాయకులు తిరుపతి, భరత్ ప్రశాంత్ పాల్గొన్నారు.





## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వినియోగించాలి

**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**
వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలతో జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ను వినియోగించాలని పాత్ ఎన్జీవో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ జావిద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపుల్లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులతో కలిసి సోమవారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఆయుష్మాన్ భారత్ యాప్లో నమోదు చేయాలన్నారు. దీనివల్ల ఆసుపత్రులకు, ఫార్మసీకి వచ్చే రోగుల హెల్త్ కార్డును లింక్ చేస్తే జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రతీ కార్డుకు రూ.20 చొప్పున ఇన్సెంటివ్ పొందవచ్చని తెలిపారు. రోగుల సంరక్షణకు, డిజిటల్ ఆరోగ్య సేవలను ప్రజలు పొందేందుకు, వారి ఆరోగ్య డేటా సంరక్షించుకునేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఉపయోగపడుతుందని వివరించారు. పాత్ ఎన్జీవో సభ్యులు నరేశ్, డీపీవో ప్రశాంతి, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రవళిక, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఓ వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష

**ఆసిఫాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**
గంజాయి కేసులో ఓ వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ సోమవారం తీర్పు ఇచ్చారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం 26.07. 2020న జైనూర్ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న షైక్ అమరుద్దీన్ బ్యాగులో గంజాయి లభ్యమయింది. అతనిని విచారించగా పరిసర గ్రామాల నుండి గంజాయి సేకరించి. మహారాష్ట్రకు అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారు. అతని పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితుడు షైక్ అమరద్దీన్ కు మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితు డికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత నరేందర్‌కు సన్మానం



**మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)**
ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన శ్రమశక్తి అవార్డును అందుకున్న ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు, సింగరేణి కోల్ మెన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టియుసి) కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్ కు ఆదివారం రాత్రి పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఐఎన్టీయూసీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, బీనాదేవిలు హాజరై, నరేందర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ... అతి చిన్న వయస్సులోనే నరేందర్ కు శ్రమశక్తి అవార్డు లభించిందని, అకుంఠిత దీక్షతో, క్రమశిక్షణతో పని చేసే నాయకులకు యూనియన్ లో తప్పక గుర్తింపు ఉంటుందని చెప్పడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. యూనియన్‌లో సైతం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపులభిం చేలా కృషి చేస్తామన్నారు. రానున్న నాలుగు సంవత్సరాలలో ఏరియాలో కొత్త గనులు తీసుకురావడానికి, కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి యూనియన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి యాజమాన్యం సొంతంగా ఐటీ కంపెనీ స్థాపించి, సింగరేణిలో పనిచేస్తున్న వందల మంది బీటెక్, ఇతర ఉన్నత చదువుకున్న వారికి ఐటి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, సింగరేణిని ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. అదేవిధంగా సిమెంట్ కంపెనీని సైతం స్థాపించి, సొంతంగా సిమెంట్ ఉత్పత్తిని సింగరేణి యాజమాన్యమే చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమిష్టిగా పని చేస్తే విజయం మనదే అని, తిరుగులేని శక్తిగా ఐఎన్టీయూసీ ఎదుగుతుందన్నారు.

భారీగాలి వానలో సైతం ముక్కోవని పట్టుదలతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో యూనియన్ శ్రేణులు పనిచేసి, సింగరేణిలో ఐఎన్టీయూసీ జెండాను ఎగిరేల కృషి చేయాలని కోరారు. అనంతరం అవార్డు గ్రహీత రాంశెట్టి నరేందర్ మాట్లాడుతూ, ఏరియాలోని ప్రతి ఒక్క ఐఎన్టీయూసీ కార్యకర్తకు లభించినట్లేనని, తనను గుర్తించి, తనకు ఇంతటి గొప్ప ప్రతిష్టాత్మకమైన అవార్డును రావడానికి కృషి చేసిన యూనియన్ నేత జనక్ ప్రసాద్‌కు రుణపడి ఉంటానన్నారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, యూనియన్ బలోపేతానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు విలేకరుల రిమాండ్

**కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఇచ్చోడ, మే 5 (ప్రభాత సమాచారం)**

బోథ్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు రిపోర్టర్లు పేకాట ఆడుతున్న వారిని డబ్బులు డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు ఓ ప్రముఖ టీవీ ఛానెల్ (బోథ్)కు చెందిన ప్రవీణ్ కుమార్, ఓ పత్రికకు చెందిన జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అజయ్ రాథోడ్‌లను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ నియోజకవర్గానికి చెందిన ఓ ప్రముఖ టీవీ ఛానల్ రిపోర్టర్ ప్రవీణ్ తోపాటు, ఓ పత్రికకు చెందిన రాథోడ్ అజయ్‌లు గత 15 రోజుల క్రితం ఇచ్చోడ మండల పరిధిలోని పంట పొలంలో పేకాట ఆడుతున్న కొంతమందిని ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ విజయ్ పేకాటఆడుతున్న వారిని పట్టుకున్నారని తెలిపారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా, కేసు నమోదు కాకుండా చూస్తానని విజయ్ పేకాటరాయుళ్లతో బేరం కుదుర్చుకొని రూ.50,000 తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మరి కొంత మంది విలేకరులు తమకు సైతం డబ్బులు కావాలని డిమాండ్ చేయగా పేకాటరాయుళ్లు రూ.40 వేలు ముట్ట చెప్పినట్లు తెలిపారు. దీనిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా, విషయం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ దృష్టికి వెళ్లింది. ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేయగా, కానిస్టేబుల్, పేకాటఆడుతున్న వారి నుంచి 50 వేల రూపాయలు తీసుకున్నట్లు, రిపోర్టర్లు సైతం 40వేల రూపాయలు డిమాండ్ చేసి వసూలు చేసినట్లు తేలడంతో ఇద్దరు రిపోర్టర్లపై కేసు నమోదు చేసి, ఆదిలాబాద్ జిల్లా జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కానిస్టేబుల్ విజయ్‌ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. విలేకరులు, పోలీస్ కానిస్టేబుల్ వసూళ్ల వ్యవహారం అటు పోలీసువర్గాల్లో ఇటు స్థానికుల్లో కలకలం రేపింది.



## పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

టూ టౌన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు టూ టౌన్ సిఐ కరుణాకర్ రావు తెలిపారు. ఈ మేరకు పేకాట రాయుళ్లపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అంత కుముందు వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ టూటౌన్ పరిధిలో లారీ అసోసియేషన్ ఏరియా వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా, సంఘటన స్థలంలో పేకాట ఆడుతూ ఐదు గురు నిందితులు పట్టబడ్డారని తెలిపారు. వారి వద్ద నుండి రూ.8,800 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో సిరాజ్ ఖాన్, షేక్ హుసేన్, సందీప్, షబ్బీర్ ఖాన్, షేక్ మునీర్ ఉన్నారని, వీరంతా లారీ ఓనర్లు, డ్రైవర్లుగా గుర్తించినట్టు తెలిపారు.అయితే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడానికి లేదని, నిర్వహించిన వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు

**వాంకిడి, మే 5 (ప్రభాత సమాచారం)**

8 మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. మండలంలోని బోర్ద గ్రామ శివారులో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.17500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ప్రమాదవశాత్తు వరి పంట దగ్ధం

**నర్సాపూర్ (జి), మే 5 (ప్రభాత సమాచారం)**

మండలంలోని రాంపూర్‌కు చెందిన రైతు నసీరాబాద్ శివారులో సాగు చేస్తున్న వరి పంట సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పొలంలో 11 కేవీ వైరు తెగిపడి నిప్పు రాజుకోవడంతో 5 గుంటల వరి ధాన్యం దగ్ధమైనట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**వేమనపల్లి, మే 5 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ముల్కలపేట మత్తడివాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రాత్రివేళ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం వేకువజామున పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేతనపల్లికి చెందిన ట్రాక్టర్ యజమానులు గురుండ్ల సంతోష్, చెన్నూరి సాలయ్య, డ్రైవర్ పున్నంలపై కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ప్రాణహిత నది, ఇతర వాగుల్లో నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

## నీట్ ర్యాంక్ రాదనే బెంగతో యువకుడి ఆత్మహత్య



**ఉట్నూర్, మే 5 (ప్రభాత సమాచారం)**

నీట్ ర్యాంక్ రాదనే బెంగతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ మోగిలి కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గంగాధర్‌కు ఏకైక కుమారుడు మనోజ్ (18) ఇంటర్ పూర్తి చేసి నీట్ పరీక్ష కోసం లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకున్నాడు. ఇటీవల రాసిన నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ రాదేమోనని బెంగతో సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. వైద్యులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కుమారుడు డాక్టర్ కావాలని ఆశయంతో కష్టపడి చదివిస్తే అప్పుడే నూరేళ్లు నిండాయని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది. పరీక్షల్లో ఫెయిల్, ర్యాంక్ రావని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకో వద్దని మళ్లీ సాధిస్తామని మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని, తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చవద్దని పలువురు అభిప్రా యాలు వ్యక్తం చేస్తున్నారు.



## అనుమానాస్పద స్థితిలో
## ఉరేసుకుని వివాహిత మృతి

**ఉట్నూర్, మే 5 (ప్రభాత సమాచారం)**

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని గంగాపూర్కు చెందిన సంజీవ్ మూడో కుమార్తె సుప్రియ(22)ను ఐదేళ్ల క్రితం ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్కు చెందిన జాడి రాధాకృష్ణతో వివాహమైంది. వీరికి ఓ పాప (4) సంతానం. రాధాకృష్ణ కూలీ పనిచేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొన్ని రోజులుగా వరకట్నం తేవాలని భార్యను మానసికంగా వేధించసాగాడు. ఈక్రమంలో ఆదివారం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. రాత్రి మనస్తాపంతో చీరతో ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన భర్త, బంధువుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త బంధువులు ఈ విషయాన్ని సుప్రియ తల్లిదండ్రులకు చెప్పారు. బంధువులతో కలిసి వారు అక్కడికి చేరుకుని రోదించారు. తన కూతురిని అల్లుడు కొట్టి హత్య చేసి ఉరేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నాడని ఆరోపించారు. తండ్రి ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోగిలి తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

## జొన్న లేప తిని
## మూడు ఆవుల మృతి

**దిలావర్‌పూర్, మే 5 (ప్రభాత సమాచారం)**

దిలావర్‌పూర్ మండలంలోని మాడిగం గ్రామంలో సోమవారం పంటచేరిలో జొన్నలేప తిని మూడు ఆవులు మరణించినట్టు రైతు విజయ్ తెలిపారు. పశువుల మేత కోసం వెళ్ళిన ఆవులు లేత జున్ను ఆకులను తినడంతో అస్వస్థకు గురై మృతి చెందగా 30 వేల ఆర్థిక నష్టం జరిగినట్టు రైతు వివరించారు. సంఘటన స్థలాన్ని పశు వైద్యాధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## నష్టపోయిన మామిడి తోటలను సందర్శించిన ఎమ్మెల్యే



**నెన్నెల, మే 5 (ప్రభాత సమాచారం)**

నెన్నల మండలంలో గాలివాన బీభత్సానికి నష్టపోయిన మామిడి తోటలు, రైతు కుటుంబాలను సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించారు. నెన్నల మండలంలో ఇటీవల ఈదురు గాలుతో కురిసినకాల అకాల వర్షాలకు నేలమట్టమైన ఇండ్లను, నష్టపోయిన మామిడి తోటలని చూశారు. ఈదురు గాలులు భారీ వర్షానికి నెన్నెల మండలం ఆవడం, గంగారం, చిత్తాపూర్ గ్రామాలలోని మామిడి తోటలు గృహాలు నష్టపోయాయి. ముందుగా ఎమ్మెల్యే నెలమట్టమైన మామిడి తోటలను సందర్శించారు. నేలమట్టమైన గృహదారులు, రైతులను పరామర్శించారు. నష్టపోయిన ఇళ్లకు, రైతుల పంట నష్టానికి పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అందుకోసం పూర్తి నివేదికను తయారు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులు గృహాలను కోల్పోయిన బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నెన్నెల మాజీ ఉప సర్పంచ్ పుప్పాల అంజన్న తల్లి పుప్పాల తారక్క ఇంట్లో నిద్రిస్తుండగా ఇటీవలే కురిసిన వడగండ్లవాన వల్ల ఇంటి పైకప్పు కూలి గాయపడింది. ఆమెను కూడా పరామర్శించారు. బెల్లంపల్లి ఆర్డిఓ హరికృష్ణ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి



**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

ప్రతి సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. 15 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల ఉన్న గౌరవం పతక స్థాయికి చేరుకుంటుందని, ప్రజలలో పోలీసుల పై నమ్మకం, కీర్తి ప్రతిష్టలు పెంపొందించబడతాయని తెలిపారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకోలేని వారు మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ద్వారా 8712659973 నంబర్కు వాట్సప్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. ఈరోజు స్వీకరించిన ఫిర్యాదులలో కుటుంబ తగాదాలు, భార్యాభర్తల మధ్య సమస్యలు, వివిధ కేసుల నమోదు పై ఉన్న సమస్యలపై జిల్లా ఎస్పీకి పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిసి కొండ రాజు, జైస్వాల్ కవిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్వల్ప భూకంపం



- ఒక్కసారిగా ఉలిక్కి పడ్డ ప్రజలు
- ఐదు సెండ్ల వ్యవధిలో రెండు సార్లు కంపించిన భూమి
- ఖానాపూర్‌లో భయంతో పరుగులు తీసిన జనం
- జన్నారం, మామడలో కిందపడ్డ వస్తువులు
- నిర్మల్‌లోనూ భూప్రకంపనలు
- భయాందోళనకు గురైన ప్రజలు
- రిక్టర్ స్కేల్‌పై 3.9శాతంగా నమోదు
- ముందే హెచ్చరించిన నిపుణులు
- సింగరేణిని వణికిస్తున్న భూకంపాలు.. నాలుగేళ్లలోనే ఆరుసార్లు



**ఆదిలాబాద్ ప్రతినిధి, మే 5 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం మండలంలోని పొన్కల్, నల్లుర్తి, ఆదర్శనగర్, అనంతపేట, పోతారం గ్రామలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం స్వల్ప భూకంపం సంభవించింది. దీంతో ఒకేసారి గోడలు కదలడంతో ప్రజలు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. సాయంత్రం 7 గంటల సమయంలో సుమారు 10 సెకండ్ల పాటు భూమి కంపించిందని పలువురు ఇళ్లలోంచి బయటకు వచ్చి చర్చించుకోవడం జరిగింది. దీంతో ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతుంది. ఇంటిలోని వస్తువులు కింద పడడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి అపాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

**మంచిర్యాల జిల్లాలో..**

మంచిర్యాల జిల్లాలోని జన్నారంలో స్వల్పంగా కంపించింది. అనూహ్య పరిణామంతో హడలెత్తిన ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపంపై స్పందించిన అధికారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండటం బెటర్ అని ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఇటీవలే పారిశ్రామిక ప్రాంతంలో భూమి కంపించిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే మరోసారి భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండంతో పాటు పలు సమీప ప్రాంతాల్లో భారీ భూకంపం సంభవించే ప్రమాదం ఉందని, ఆ ప్రకంపనలు అమరావతి వరకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. భూకంపాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం రాత్రి భూమి స్వల్పంగా కంపించింది. సుమారు ఐదు సెకన్లపాటు కంపించినట్లు తెలుస్తోంది. జన్నారం మండలం తపాలాపూర్, పొనకల్ శ్రీలంక కాలనీ, రాంపూర్, ధర్మారం, కలమడుగు, చర్లపల్లి, జన్నారం, లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్, ఇటిక్యాల, లక్సెట్టిపేట, దండేపల్లి మండలం తాళ్లపేట, చింతపల్లి గ్రామాల్లో రాత్రి 6.50గంటల ప్రాంతంలో భూమి కంపించింది. పొనకల్ శ్రీలంకకాలనీలో ఉపాధ్యాయుడు జాడి రాజన్న టేబుల్‌పై గ్లాస్ పెట్టి కుర్చీలో కూర్చోగా గ్లాస్ కిందపడిందని, కుర్చీలో రెండు సెకన్లు కదిలిందని తెలిపారు. తపాలపూర్ గ్రామంలో బోళ్ల స్టాండ్ నుంచి గ్లాసులు కింద పడినట్లు విజయధర్మ తెలిపారు. ఇళ్లలోని వస్తువులు అటు ఇటూ కదిలినట్లు అయ్యాయని పలు వురు తెలిపారు. ప్రకంపనలతో ఆయా గ్రామాల్లో ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు.

**సింగరేణిని వణికిస్తున్న భూకంపాలు.. నాలుగేళ్లలోనే ఆరుసార్లు**

సింగరేణిని వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలాన్ని భూకంప కేంద్రంగా నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ గుర్తించింది. రిక్టర్ స్కేల్ పై 3.8 మాగ్నిట్యూడ్ అని పేర్కొన్నది. భూమికి 10 కి.మీ. లోతున ప్రకంపనలు వచ్చినట్టు తెలిపింది. నిజానికి 10 కిలోమీటర్ల లోతు అనేది చాలా తీవ్రమైనది.. రిక్టర్ స్కేల్ పై 5దాటితే అది అత్యంత విషాదాన్ని మిగిల్చే ప్రమాదం ఉన్నది. అయితే, నాలుగేళ్లలోనే ఈ ప్రాంతానికి సమీపంలోనే ఆరు చోట్ల భూకంపాలు రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పైగా ఇవన్నీ రెబ్బెనకు 100కిలోమీటర్లలోపే పరిధిలోపే ఉండటం గమనించవచ్చు. బ్రిటిష్ హయాం నుంచి బొగ్గు ఖనిజం కోసం ఈ ప్రాంతంలో చాలాకాలం పాటు అండర్ మైనింగ్ జరిగింది. ఆ తర్వాత ఓపెన్ మైనింగ్ చేపడుతున్నారు. కానీ, చాలా అండర్ మైన్స్ లో నిబంధనల ప్రకారం గనులను పూడ్చారని నేటికీ చాలామందిలో సందేహాలు ఉన్నాయి. అయితే, ఇటీవల వరుసగా సంభవిస్తున్న భూకంపాలతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల్లో అనేక భయాందోళనలు మొదలయ్యాయి. అధికారులు తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయడం, భూకంప సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అదేసమయంలో భారీ భవనాల విషయంలో నిబంధనలు పటిష్ఠంగా అమలుచేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**గత నాలుగేళ్లలో వచ్చిన భూకంపాలు...**

◆ 2024.02.11: మహారాష్ట్ర టోమ్టా ప్రాంతం
రిక్టర్ స్కేల్: 3.2 మాగ్నిట్యూడ్
లోతు: 10కి.మీ.

◆ 2023. 03.21: దహెగాం, ఆసిఫాబాద్ జిల్లా
రిక్టర్ స్కేల్: 3.1 మాగ్నిట్యూడ్
లోతు: 5కి.మీ.

◆ 2021.10.23: ఇందారం, మంచిర్యాల
రిక్టర్ స్కేల్: 3.6 మాగ్నిట్యూడ్
లోతు: 5కి.మీ.

◆ 2022.10.12: పరందోళి, ఆదిలాబాద్
రిక్టర్ స్కేల్: 2.7 మాగ్నిట్యూడ్
లోతు: 10కి.మీ.

◆ 2021.10.31: అల్గావ్, మంచిర్యాల
రిక్టర్ స్కేల్: 4 మాగ్నిట్యూడ్
లోతు: 10కి.మీ.

## ఎరువులు అధికంగా వాడితే పంటలకు అనర్థమే

**తాంసి, మే 5 (ప్రభాత సమాచారం)** రసాయన ఎరువులు అధికంగా వాడితే అనర్థమేనని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే దిగుబడి తగ్గి పెట్టుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. సాధారణంగా నేల స్వభావం, భూస్వారాన్ని బట్టి ఎరువులు వాడాలని,



కానీ రైతులు ఒకే రకమైన ఎరువులు వినియోగిస్తున్నారని తెలిపారు. కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డి నేటర్ డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పంటలలో యూరియా వాడకం, రసాయనిక ఎరువులను తగ్గించాలని రైతులకు సూ చించారు. విత్తనాలు కొనుగొలు చేసేటప్పుడు రసీదు ను భద్రపర్చుకోవాలని, సాగు నీటిని ఆదా చేయాలని కోరారు. పంట మార్పిడిని పాటించాలని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమం లో కేవీకే శాస్త్రవేత్తలు కె.రాజశేఖర్, జి మోహన్ దాస్, పోషాద్రి, సునీల్ కుమార్, జి శివచరణ్, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రాజెందర్ రెడ్డి, ప్రవీన్, తాంసి డివిజన్ ఏడీఏ రవీందర్, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు లింగారెడ్డి, మల్లయ్య, ఆనంద్,అనిల్ కుమార్, సాయినాథ్, రమణ, లక్ష్మీపతి, కిరణ్ కుమార్, రఘు, క్రాంతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ సీఐ గోపినాథ్‌కు ఉత్తమ పురస్కారం

**ముథోల్, మే 5 (ప్రభాత సమాచారం)** తెలంగాణ రియల్ హీరోస్ పేరిట విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీ సులను ప్రభుత్వం సోమవారం అవార్డులతో సత్కరించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించినందు కుగానూ పట్టణ సీఐ గోపినాథ్ సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లోని ఎస్సైలు, సిబ్బంది సీఐకి అభినందనలు తెలిపారు.








# వంద కోట్ల క్లబ్‌లోకి 'హిట్ 3'..

నేచురల్ స్టార్ నాని శైలేష్ కొలను కాంబోలో విడుదలైన హిట్3 బాక్స్ ఆఫీస్ వద్ద కలెక్షన్ల జోరు కొనసాగిస్తోంది. తొలిరోజే రూ. 40 కోట్ల వసూళ్లతో అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే 100 కోట్ల క్లబ్ లోకి చేరింది. నాలుగు రోజుల్లో 'హిట్ 3' ప్రపంచవ్యాప్తంగా రూ. 101 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా పోస్టర్ రిలీజ్ చేశారు. ''సర్కార్స్ సెంచరీ'' అంటూ ట్వీట్ చేశారు.సక్సెస్ ఫుల్ థియేట్రికల్ రన్ కొనసాగుతుండడంతో కలెక్షన్స్ ఇంకా పెరిగే అవకాశం ఉంది. హాయ్ నాన్న, కోర్ట్, హిట్3 వరుస విజయాలతో ఫుల్ జోష్ ఉన్నారు నాని. నాని స్వయంగా ప్రొడ్యూస్ చేసిన ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, కోమలీ ప్రసాద్, సముద్రఖని, రావు రమేష్, రవీంద్ర విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.ఇదిలా ఉంటే ఈ సినిమా తర్వాత 'పారడైస్' అంటూ మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ తో ముందుకు వస్తున్నారు నాని. ఇందులో ఇప్పటివరకు ట్రై చేయని ఓ భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి టైటిల్ గ్లిమ్స్ విడుదల చేయగా.. నాని మాస్ లుక్, డైలాగ్స్ ఫ్యాన్స్ కి ఫుల్ జోష్ ఇచ్చాయి. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



# వీరమల్లు బరిలో దిగాడు

హరి హర వీరమల్లు'ను ముగించేందుకు కథానాయకుడు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. ఆఖరి షెడ్యూల్ కోసం పవన్ ఆదివారం సెట్లోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు ఈ చిత్రీకరణ కొనసాగనుంది. దీనిలో భాగంగా పవన్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించి.. 6వ తేదీతో సినిమాకి గుమ్మడికాయ కొట్టనున్నారు. ఆ వెంటనే చిత్రబృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇందులో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్. నిర్మాత: ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ.ఎం.రత్నం.

# బాలీవుడ్‌కి మీనాక్షి?

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఈ ఏడాది ప్రారంభంలో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది అందాల తార మీనాక్షి చౌదరి వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోన్న ఈ భామ.. ఇప్పుడు బాలీవుడ్‌లో తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. 'స్త్రీ', 'మిమీ' లాంటి హిట్ చిత్రాలను నిర్మించిన దినేశ్ విజన్ రూపొందిస్తున్న ఓ ప్రాజెక్టులో మీనాక్షి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. "దక్షిణాదిలో జోరు చూపిస్తున్న మీనాక్షి కోసం నిర్మాణ సంస్థ మడాక్ ఫిల్మ్స్ ప్రత్యేకంగా కథను సిద్ధం చేస్తుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర శక్తిమంతంగా ఉండనుంది. మీనాక్షి స్క్రీన్ ప్రెజెన్స్, నటనా సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రబృందం తనకు సరిగ్గా సరిపోయే హీరోను వెతికే పనిలో పడింది. మరికొన్ని రోజుల్లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని మీనాక్షి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# కార్మికుల హక్కులను కాలరాస్తూ
# కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు
## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)

కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న 4 లేబర్ కోడులను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా కార్మికసంఘాలు ఈ నెల 20న ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. ఏరియాలోని కాసిపేట-2 గనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. నూతన లేబర్ కోడ్ లతో కార్మికులకు హక్కులనేవి లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత దూకుడుగా వ్యవహరిస్తుందని కార్మికులకు కొత్త హక్కులు ఇవ్వకపోగా చట్టబద్ధంగా ఉన్నటువంటి హక్కులను తీసివేసేలా కొత్తకోడ్ లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆయన మండిపడ్డారు. నూతన చట్టాలు అనలు జరిగితే భవిష్యత్తులో పరిశ్రమలను నష్టాల సాకులు చూపెట్టి కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ కు ఎసరు పెట్టే ప్రమాదముం




దని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తే కార్మికులకు, సమ్మె పిలుపు నిచ్చిన కార్మిక సంఘాలకు పెనాల్టీ వేసే విధానంను కార్మికులు కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి తిప్పికొట్టాలని ఆయన కోరారు. కార్మిక సంఘాల మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్న కార్మికుల హక్కులను కాపాడ దానికి ఒకే తాటిపైకి వచ్చి మే 20న జరుగు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని కార్మికులు ముందుండి రైతుల స్ఫూర్తితో లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు ఆందోళనలు ఉధృతం చేయాలన్నారు. సింగరేణి లాభాల నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటాలు తీసుకుంటున్నాయే తప్ప కొత్త గనులను కేటాయించి భవిష్యత్తును పెంచదామని చూడడం లేదని బకాయిలు సైతం పేరుకుపోతున్న పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. కార్మికులను కార్మిక సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తూ ఐక్యపోరాటాలకు వారధిగా ఉన్న సిఐటియు సొంతింటి కళ, పెర్క్ పై ఐటి మాఫీ, మారు పేర్లతో పాటు ఇతర అంశాలపై కార్మికులకు కల్పిస్తున్న అవగాహన, పోరాటాన్ని గమనించిన పలువురు మైనింగ్ స్టాఫ్, ఓవర్ మెన్ కార్మికులు మహేష్, రాజేష్, అరవింద్, టెక్నికల్ స్టాఫ్ ఫోర్ మెన్ నవీన్, ఎలక్ట్రీషన్ మధుకర్ తో పాటు సతీష్, సూరం మనోజ్, మురళి, రాజేష్లు యూనియన్లో చేరగా వారికి కండువాలు కప్పియూనియన్లోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు సాంబారు వెంకటస్వామి, అల్లి రాజేందర్, పిట్ సెక్రటరీ బుద్దే సురేష్, ఆర్గనైజర్ విద్యాసాగర్ షిఫ్ట్ ఇంచార్జ్ నామని సురేష్, కార్తీక్, శ్రావణ్, అలవాల సంజీవ్లు పాల్గొన్నారు.



## వార్డుల్లో మౌలిక
# సదుపాయాల కల్పనే ధ్యేయం

మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)

పట్టణంలో వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉపేందర్ గౌడ్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనులలో సోమవారం పట్టణంలోని 21వ వార్డులో 6 లక్షల ఎస్డిఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ పట్టణంలో 24 వార్డుల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు స్వయంగా తెలుసుకుని ఏ వార్డులో అభివృద్ధి పనులు అవసరమున్నాయో స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రతి వార్డులో మంచినీటి సౌకర్యం, డ్రైన్స్, రోడ్లు నిర్మాణం వంటివి చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఎండి జలీల్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి ఎండి సుకూర్, రాచర్ల రవి, తుంగ పిండి విజయ్, బండి శంకర్ గౌడ్, బుర్ర ఆంజనేయులు గౌడ్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సొతుకు ఉదయ్, రావుల శ్రీనివాస్, ఆలం శంకర్, కొత్తపల్లి రాయమల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక శిక్షణ ఇవ్వడంలో ఏటీసీలది కీలకపాత్ర
## పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)

గ్రామీణ యువతకు ఆధునిక శిక్షణ ఇవ్వడంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లది కీలకపాత్ర అని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏటిసి సెంటర్ ను సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎటీసీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముఖాముఖి చర్చించారు. విద్యార్థుల అవసరాలు, సమస్యలు, కేంద్రంలోని ప్రత్యేకతలను ఎంపీ సమీక్షించారు. టెక్నికల్ శిక్షణ, ఉపకరణాల అందుబాటుపై అధికారులు ఇచ్చిన వివరాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యున్నతికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ముందుంటానని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో



ఎటీసీ లను మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ మార్గదర్శకాలు రూపొందించి యువతను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## మూడు నెలలుగా
# అందని వేతనాలు
## ఉద్యోగులు, కార్మికులు ఆందోళన

బెల్లంపల్లి, మే 5 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్, కార్మికులు, ఉద్యోగులు, పెండింగ్ వేతనాల కోసం సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన దిగారు. గత మూడు నెలలుగా వేతనాలు లేక అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వేతనాల చెల్లింపు జాప్యానికి విసిగిపోయిన ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నాకు దిగారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఓం నారాయణ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు వేతనాలు చెల్లించాలంటూ ప్లే కార్డులు, నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి ముఖ ద్వారం వద్ద ధర్నా చేశారు. ఫిబ్రవరి, మార్చి నుంచి ఏప్రిల్ 2025 మూడు నెలలుగా వేతనాలు విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేని యెడల నిరవధిక ఆందోళన వెనకాడమని రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నారాయణ హెచ్చరించారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ రవికుమార్ కు వినతి పత్రం అందజేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ కిరణ్, దుర్గప్రసాద్, మహేష్, షమీన్, నీరజ, ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు, పారిశుద్ధ కార్మికులు రమేష్, లక్ష్మన్, సాయి, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, మే 5 (ప్రభాత సమాచారం)

## రైతు సంక్షేమంలో
# శాస్త్రవేత్తలు కీలకం
## రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు

బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయం, సాగు విధానాలపై ప్రధానంగా భూభారతి చట్టంపై అవగాహన పెంపొందించడానికి ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చే స్తుందన్నారు. శాస్త్రవేత్తలు శాస్త్రీయమైన సలహాలు సూచనలతో రైతులకు వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటు ను అందించాలన్నారు. వ్యవసాయం, రైతు అభివృద్ధిలో శాస్త్రవేత్తల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాస్త్రవేత్త కోట శివకృష్ణ మాట్లాడారు. వ్యవసాయ అభివృద్ధికి తమ వంతు కృషిని చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు రైతులకు పంట సాగు విధానాలపై వాతావరణంపై అవగాహన కల్పిస్తూనే రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కల్పన, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, మాజీ జెడ్పిటిసి కారుకూరి రామచందర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)

పట్టణంలో 1995లో నిలిచిపోయిన మున్సిపల్ ఎన్నికలను వెంటనే నిర్వహించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ కేంద్ర రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం జాతీయ రహదారుల ప్రారంభోత్సవానికి కాగజ్ నగర్ కు వచ్చిన కేంద్రమంత్రిని పట్టణ బిజెపి నాయకులు రొడ్డ మోహన్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రొడ్డ మోహన్ మాట్లాడుతూ... పట్టణంలో నిలిచిపోయిన మున్సిపల్ ఎన్నికలను వెంటనే నిర్వహించి, 1/70 యాక్ట్ను ఎత్తివేయాలని, 2002లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన లెదర్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగి ప్రారంభానికి నోచుకోలేదని కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి లెదర్ ఫ్యాక్టరీని ప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. పట్టణంలోని రైల్వే స్టేషన్లో ఎక్ ప్రెస్ రైళ్ళు ఆగటం లేదని, ప్యాసింజర్, రామగిరి, సింగరేణి సూపర్ఫాస్ట్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. పట్టణంలోని పాత బస్టాండ్, రామన్ కాలనీ, యాపల్, విద్యానగర్ ఏరియాల ప్రజలు రైల్వే స్టేషన్ కు వెళ్లేందుకు వీలుగా రైల్వే ట్రాక్ పక్క నుండి రైల్వే స్టేషన్ కి అప్రోచ్ రోడ్డు నిర్మించా లన్నారు. జీఎం కార్యాలయం సమీపంలో ప్రజలు రోడ్డు దాటేందుకు వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామటెంకి దుర్గారాజు, మల్యాల రాజమల్లు, కోలేటి శివ, నాగపురి సంతోష్ ప్రసాద్లు పాల్గొన్నారు.




**కాగజ్నగర్ తరలివెళ్ళిన బిజెపి నాయకులు...**

జిల్లాలోని 363 జాతీయ రహదారుల ప్రారంభోత్సవానికి కేంద్ర రహదారి అభివృద్ధి శాఖ మంత్రి కాగజ్నగర్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పట్టణంలోని బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో పట్టణ, మండల బిజెపి నాయకులు దాని అనుబంధ సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లారు.

## ప్రమాదవశాత్తు
# పశువులపాక దగ్ధం

ముథోల్, మే 5 (ప్రభాత సమాచారం)

మండలంలోని ఉమ్రి(కె) గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధమైంది. తహసీల్దార్ లింగమూర్తి, బాధిత రైతు నర్సింగ్ తెలిపిన వివరాలు.. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో రైతులు సాయంత్రం గడ్డి కుప్పలకు నిప్పంటించారు. వీస్తున్న గాలికి నిప్పురవ్వలు పశువుల పాకలో గడ్డికి అంటుకోవడంతో నిల్వ ఉంచిన పశుగ్రాసంతోపాటు పనిముట్లు కాలి పోయాయి. గ్రామస్తులు అందించిన సమాచారంతో తహసీల్దార్ లింగమూర్తి, ట్రైనీ ఎస్సై నవనీత్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాదంలో రూ.40 వేల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు.




- చివరికి.. మళ్లీ పరుగులే!
- అకాలవాన అన్నదాతను ఏడిపిస్తోంది..
- నిండు వేసవిలో వరుణ దాడి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సం
- కల్లాల్లో తడిసిన ధాన్యం ■ రైతు కళ్లలో నీళ్లు..
- గాలివానకు కొట్టుకుపోయిన టార్పాలిన్లు
- తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన

**ఆదిలాబాద్ ప్రతినిధి, మే 5 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ వర్షం పడినప్పటికీ రైతుకు పెద్దగా నష్టం జరగలేదు. కానీ నిర్మల్ జిల్లాలో గోదావరి పరివాహక మండలాల్లో సుమారు గంటకుపైగా కురిసిన భారీ వర్షం రైతాంగాన్ని తీవ్రంగా నష్టానికి గురిచేసింది. ఆదిలాబాద్ జిల్లాలోనూ బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లో పలుచోట్ల భారీగా వర్షాలు పడ్డాయి.

**వడ్లు వర్షార్పణం..**

వరి కోత తర్వాత వచ్చిన ధాన్యం పెద్ద మొత్తంలో వర్ష ప్రభావానికి గురైంది. సాయంత్రం గంట నుంచి గంటన్నర పాటు భారీగానే వర్షం పడింది. దీంతో కొనుగోలు కేంద్రాలలో అమ్మకానికి ఉంచిన ధాన్యం తో పాటు, కల్లాల్లో నేర్పి ఆర బోసి ఉంచిన ధాన్యం కూడా వర్ష ప్రభావానికి గురైంది. గాలివాన బీభత్సం వల్ల రైతాంగానికి తీరని నష్టం వాటి ల్లింది. వర్షాల నుంచి పంటల రక్షణకు కప్పిన తార్పాలిన్ కవర్లు భారీ ఈదురుగాలులకు కొట్టుకుపో యాయి. ఒక్కో తర్పాలిన్ ధర కనీసం 1200 నుంచి 3000 చెడగొట్టు



వానలతో తీరని నష్టం దాకా ఉంటుంది. దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపో యారు. తడిసిన ధాన్యం రైతుల నుంచి కొనేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు నిరాకరించే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో రైతులను భిన్న రకాలుగా వేధిస్తూ ధాన్యం తరుగు పేరిట ఎక్కువ తూకం వేస్తున్న నిర్వాహకులు తడిసిన ధాన్యం పేరుతో మరింత వేధింపు లకు గురి చేసే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.



**విద్యుత్ సరఫరాకు ఆటంకం...**

గాలివాన బీభత్సం కారణంగా సాయంత్రం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరెంటు సరఫరాను పలుసార్లు నిలిపివేశారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల దాకా ఒక్కోచోట ఒక్కోరకంగా గంట నుంచి రెండు గంటల పాటు కరెంటు సరఫరా నిలిపివేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో రాత్రి 8:30 దాకా ఫీడర్లలో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.





## సమ్మె నోటీసు అందజేత

**శ్రీరాంపూర్, మే 5 (ప్రభాత సమాచారం)**

దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించే సమ్మెను 17 డిమాండ్లతో కూడిన నోటీసును సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నేతలు యజమాన్యానికి అందించారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్. బలరాంనాయక్, డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాస్‌కు ఈ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ సీతారామయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డి.బ్రహ్మానందం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యదర్శి కామెర గట్టయ్య, ఏఐఎఫ్ఎయూ అధ్యక్షుడు జి. రాములు, టీఎన్టీ యూసీ జనరల్ సెక్రెటరీ మనీ రాంసింగ్, ఎస్ఓకేఎస్ అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ 3ం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె ఉంటుందన్నారు. దేశవ్యాప్త డి మాండ్లతోపాటు సింగరేణి పరిధిలో డిమాండ్లను సమ్మెలో పెట్టామన్నారు. సింగరేణిలో కొత్త భూగర్భ గనులకు కేంద్రం అనుమతి ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో మాదిరిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ నాయకులు బోసు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ కార్మికులు పాల్గొనాలని మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ సీవీఎన్. రాజును కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు జనార్దన్, భిక్షపతి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి





**జైనథ్, మే 5 (ప్రభాత సమాచారం)**

భూ సమస్యలు సత్వర మే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం భోరజ్ మండలంలోని కోర్టా గ్రామం లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హెల్ప్ డెస్క్ కౌంటర్లలో రిసెప్షనిస్టులను ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోరజ్ మండలంలో 28 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి రోజు కోర్టతో పాటు గణేషాపూర్, పూసాయి గ్రామాల్లో సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి,ఆర్ భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు. ఇటీవల ప్రధాని చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను గోం రాయి సెంటర్ జిల్లా సార్మేడి మెస్రం దుర్గు పటేల్ సోమవారం కలెక్టరేట్‌లో కలిసి శాలువాతో సన్మానించారు.

## దేశ వ్యాప్త కులగణన నిర్ణయం బీసీల విజయం

**మందమర్రి, మే 5 (ప్రభాత సమాచారం)**

దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఉదారి చంద్ర మోహన్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్త కుల గణన నిర్ణయం చారిత్రాత్మకం అని చారిత్రాత్మక నిర్ణయాలు అమలు చేయడం భారత ప్రధాని నరేంద్ర మోడీకే సాధ్యమని వారన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటాలతోనే కులగణన సాధ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిసి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి, మేమెంతో మాకంత కూడా వాటా కావాలని, సభలు, సమావేశాలు, రిజర్వేషన్ల సాధన యాత్రలు, దేశవ్యాప్తంగా కులగణనను జరపాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా ధర్నా, ఆందోళనలు నిర్వహించి, దేశంలో అధికార పక్షాన్ని బీసీల వైపు మళ్లించే విధంగా అనేక పోరాటాలు చేయడం జరిగిందని వారు స్పష్టం చేశారు. ఇదే



సందర్భంలో తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించి, తెలంగాణలో కులగణన జరిపి అసెంబ్లీలో చట్టం చేసి, కేంద్రానికి పంపిందని రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేయడం, ఎన్డీఏ ప్రభుత్వం మెజారిటీ ప్రజల కోరిక మేరకు దేశవ్యాప్తంగా కులగణన నిర్ణయం తీసుకోవడాన్ని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం స్వాగతిస్తుందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోపు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివే యాలనీ, వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ యూత్ అధ్యక్షులు ముదారపు శేఖర్ పాల్గొన్నారు.

### ఇకపై ఆలస్యంగా వస్తే

## అధికారులపై చర్యలు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మే 5 (ప్రభాత సమాచారం)**



ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు మొక్కుబడిగా వస్తున్నారని సమయపాలన పాటించడం లేదని అటువంటి అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 గంటల వరకు జిల్లా అధికారులు రాకపోవడం కొందరు అధికారులు క్రింది స్థాయి ఉద్యోగులను ఉద్యోగులను పంపడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని అటువంటి వారికి సత్వర న్యాయం చేయవలసిన బాధ్యత అధికారులపై ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పాఠశాలతో విద్యార్థుల్లో మార్పు





**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఎంతో మార్పు వచ్చిందనీ, ఆ మార్పుతోనే జిల్లాలో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం రాష్ట్రస్థాయిలో 9వ స్థానానికి చేర్చిందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్రంలోనే పదవ తరగతి ఫలితాలలో గత ఏడాది జిల్లా 15వ స్థానంలో ఉండగా ఈ ఏడాది 9 వ స్థానంలో అగ్రగామిగా నిలిచిందనీ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం 10 ఫలి తాలలో మెరుగైన ఫలి

## విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా గూగుల్ మీట్

తాలు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో గూగుల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాను తీసుకున్న ఆరోగ్య పాఠశాల కార్యక్రమంతో తల్లిదం డ్రులు విద్యార్థుల పై చూపించిన ప్రత్యేక శ్రద్ధ, ప్రోత్సాహంతో మంచి అలవాట్లు అలవర్చుకొని ఉత్తమ ఫలితాలు సాధించడం అర్హనీయమని గూగుల్ మీట్ లో పేర్కొన్నారు. అందరి సహకారంతో జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 97.18 శాతం ఉత్తీర్ణత తో రాష్ట్ర స్థాయిలో 9వ స్థానం నిలి చిందని కలెక్టర్ ను అభినందిస్తూ వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగాపదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలుపుతూ, అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను స్థానిక జెడ్పి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్, డిఐఈఓ గణేష్, వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నస్పూర్ ఎస్సైకి పోలీస్ రియల్ హీరో అవార్డు



**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**

సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్ రావుకు ప్రభుత్వం పోలీస్ రియల్ హీరో అవార్డు ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎస్సై ఈ అవార్డును అందుకున్నారు. ఉపేందర్ రావు రామగుండం కమిషనరేట్ పరిధి టాస్క్ ఫోర్స్ విభాగంలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ఓ గంజాయి కేసులో నిందితుడు ఎస్సారెస్పీ కాలువలోకి దూకి పారిపోతుండగా ఎస్సై ప్రాణాలకు తెగించి కాలువలోకి దూకి నిందితుడిని పట్టుకున్నారు. ఎస్సై ధైర్యసాహసాలకు మెచ్చి ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసింది.

# క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

## పోలీస్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్





**ఆదిలాబాద్, మే 5 (ప్రభాత సమాచారం)**

వేసవి కాలంలో పిల్లలకు ఆటవిడుపుగా ఉం డాలని, చెడు వ్యసనాలకు అలవాటు కాకుం డా ఉండడానికి ఈ సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రత్యేకంగా ఆదివాసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని చిన్ననాటి నుండి విద్యార్థినీ విద్యార్థులకు వ్యాయామం శిక్షణ అందిచి ఉన్నత స్థానాలకు ఎదగాలేని ఆకాంక్షించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు చోట్ల నెల రోజు ల పాటు నిర్వహించే సమ్మర్ క్యాంపును సోమవారం ఆదిలాబాద్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఎస్పీ ప్రారంభించారు. ఈ సమ్మర్ క్యాంపు లు ఆదిలాబాద్ లోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్, ఇచ్చోడ పోలీస్ స్టేషన్, ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్, నార్నూర్ పోలీస్ స్టేషన్‌లలో ఏకకాలంలో ప్రారంభించడం జరిగింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యువత, చిన్నారులకు ఒకే అంశంపై పదేపదే శిక్షణను అందించడం ద్వారా వారు ఆ కళనందు నిష్ణాతులై ఉన్నత స్థానానికి ఎదుగుతారని తెలిపారు. ముఖ్యంగా ఆటల వల్ల పిల్లలకు విద్యార్థినీ విద్యార్థులకు మానసిక శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుందని అన్ని రంగాలలో సరైన శిక్షణను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో పోలీసుల ఆధ్వర్యంలో యోగ, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీ బాల్, బాస్కెట్ బాల్, పిఈటీ తోపాటు సమ్మర్ క్యాంపులో పలు రోజులు పోలీస్ స్టేషన్ సందర్శన, నిర్వహణ, జైలు సందర్శన, పోలీస్ ల ఆయుధా ల ఉపయోగం, వాటి పనితీరుపై, జిల్లా పోలీసులు తీసుసునే కటోర శిక్షణపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి సురేందర్రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, వన్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు సిహెచ్ కరుణాకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వెంకటి, ఎన్ చంద్రశేఖర్, కరాటే మాస్టర్ ప్రవీణ్, యోగ మాస్టర్, పీఈటి సందీప్, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

## ఆరెపల్లిలో భూభారతి సదస్సు

**మంచిర్యాల, మే 5 (ప్రభాత సమాచారం)**

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. భూభారతి నూతన ఆర్డీఆర్ చట్టం అమలుపై పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన భీమారం మండలం ఆరెపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఈ నెల 20వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూభారతిచట్టంపై అవగాహన కల్పించడంతోపాటు భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్కు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేస్తామని చెప్పారు. సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరిస్తామని, వారసత్వ భూములను విరాసత్ చేసే ముందు సమగ్ర విచారణతోపాటు వారసులకు నోటీ సులు జారీ చేస్తామన్నారు. సదస్సులో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ సదానందం పాల్గొన్నారు.

**కార్యదర్శిపై కలెక్టర్ ఆగ్రహం...**

మండలంలోని ఆరెపల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు సోమవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్ కుమార్ దీపకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి సమస్య ఉన్న రెండు కాలనీలను స్వయంగా సందర్శించారు. బీసీ కాలనీకి మిషన్ భగీరథ నీరందించడం లేదని, సమీపంలోని బోరుబావికి మోటారు ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నాం కదా అని స్థానికులను ప్రశ్నించారు. పైపులైను వేయలేదని, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డికి ఎన్నిసార్లు చెప్పినాపట్టిం చుకోవడం లేదన్నారు. కలెక్టర్ వెంటనే ఫోన్ ద్వారా నీటి సరఫరా విషయమై ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గ్రామం మొత్తం నీటి సరఫరా చేస్తున్నట్లు రిపోర్టు ఇవ్వడంపై కలెక్టర్ గ్రామ కార్యదర్శిని ప్రశ్నిం చారు. ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో ప్రతీరోజు ఎక్కడ నుంచి వస్తున్నావని అడిగారు. చెన్నూరు నుంచి అని సమాధానం చెప్పడంతో మీ ఇంట్లో నీటిసమస్య ఉంటే ఇలాగే ప్రవర్తిస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి ఉందని తెలుపగా రెండు వీధులకు కలిపి రూ. 1.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి నీటిని సరఫరా చేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

# ఎమ్మెల్యేపై ఆర్డీవో అభిమానం

## ఆర్డీవో మాట్లాడిన వీడియోలను వైరల్ చేసిన బీఆర్ఎస్ నాయకులు

**చెన్నూర్, మే 5 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల రివ్యూ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు స్థానిక ఎమ్మెల్యే వివేక్‌పై ఉన్న అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. చెన్నూరు నియోజకవర్గానికి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యేగా ఉండడం మన అందరి అదృష్టమన్నారు. ఆ దేవుడు దయవల్ల ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి రావాలని తాను ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించడంతో ఈ వార్త చర్చనీ యమైంది. ఆర్డీవో మాట్లాడిన వీడియోలను బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో హల్చల్ చేయడంతో నియోజకవర్గంలో ఈ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ఏదేమైనప్పటికీ ఆర్డిఓ స్థాయిలో ఉన్న అధికారి ప్రజా ప్రతినిధులకు వత్తాసుగా మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY